

పశు బీమా.. రైతుకు ధీమా!

పశుబీమా పథకం రైతులకు ఆసరాగా నిలుస్తోంది. పశువులు మృతిచెందిన 21 రోజుల్లోనే రైతులకు పరిహారం అందుతోంది. - 8లో



ఉద్యోగ మేళాకు విశేష స్పందన

మెగా ఉద్యోగ మేళాకు విశేష స్పందన లభించింది. 15 ప్రైవేటు సంస్థలు పాల్గొనగా, 209 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. - 8లో

శ్రీకాకుళం జిల్లా ఉష్ణోగ్రతలు

మండలం	గరిష్ఠం	కనిష్ఠం
ఆమదాలవలస	40°	29°
ఇచ్ఛాపురం	39°	28°
పాతపట్నం	41°	28°
శ్రీకాకుళం	39°	28°

న్యూస్‌రీల్

టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలో పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 14 కేంద్రాల్లో జరుగుతున్న ఈ పరీక్షలకు తొలిరోజు ఫస్ట్‌లాంగ్వేజ్ (తెలుగు)కు 1299 మందికి గాను 331 మంది గైర్హాజరయ్యారు. అధికారులు, తనిఖీ బృందాలు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. డీఈఓ ఎస్.తిరుమల చైతన్య, ఉపవిద్యాశాఖాధికారులు పర్యవేక్షించారు.

జిల్లా పోలీసు కార్యాలయ ఏఓగా గోపీనాథ్



ఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న గోపీనాథ్

శ్రీకాకుళం క్రైమ్ : శ్రీకాకుళం జిల్లా పోలీసు కార్యాలయ పరిపాలనాధికారి (ఏఓ)గా సీహెచ్.గోపీనాథ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవలే బదిలీపై వెళ్లిన ఎం.శివరామరాజు స్థానంలో ఈయన వచ్చారు. అనంతరం ఎస్పీ జి.ఆర్.రాధికను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈయన ఏలూరు పోలీసు కార్యాలయంలో పనిచేసి సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడికి చేరారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ జె.తిప్పేస్వామి పాల్గొన్నారు.

జిల్లా ఉపాధి కల్పనాధికారిగా సుధ



కె.సుధ

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా ఉపాధి కల్పనాధికారిగా కె.సుధ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె విశాఖపట్నంలోని జిల్లా సాంకేతిక కల్పన కార్యాలయం నుంచి బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు జిల్లా ఉపాధి అధికారిగా పనిచేసిన జి.శ్రీనివాసరావు కాకినాడ జిల్లాకు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా సుధకు జిల్లా ఉపాధి కల్పనాధికారి కార్యాలయం సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

పాలిసెట్ ధ్రువీకరణ పత్రాల పరిశీలన

ఎచ్చెర్ల క్యాంపస్: పాలిటెక్నిక్ డిప్లమా కోర్సుల్లో ప్రవేశానికి సంబంధించిన ఏపీ పాలిసెట్ - 2023 కౌన్సెలింగ్ కొనసాగుతోంది. శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలోని సహాయ కేంద్రంలో పాలిసెట్ ర్యాంకర్లు దరఖాస్తులు పరిశీలిస్తున్నారు. సహాయ కేంద్రంలో శుక్రవారం 58001 నుంచి 74000 మధ్య ర్యాంకు విద్యార్థుల ధ్రువీకరణ పత్రాలు పరిశీలించారు. 308 మంది విద్యార్థులు హాజరయ్యారు. షెడ్యూల్ మేరకు శనివారం 74001 నుంచి 91000 మధ్య ర్యాంకు విద్యార్థుల పత్రాలు పరిశీలించనున్నారు. రీషెడ్యూల్ మేరకు శనివారం నుంచి ఆప్షన్ల ఎంపిక ప్రారంభం కానుంది. ధ్రువీకరణ పత్రాల పరిశీలన ఈ నెల ఐదు వరకు కొనసాగనుంది. కౌన్సెలింగ్ ప్రక్రియను ప్రిన్సిపాల్ జి.దామోదర్‌రావు, ఇన్‌చార్జి మురళీకృష్ణ పర్యవేక్షిస్తున్నారు.


ఆధార్ అప్‌డేట్ చేసుకోండి



మాట్లాడుతున్న డీఆర్‌ఓ మురళీకృష్ణ

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో 2010 నుంచి 2018 మధ్య, తర్వాత ఆధార్ కార్డు పొందిన వారు ప్రతి పదేళ్లకోసారి తప్పనిసరిగా నవీకరణ (అప్‌డేట్) చేసుకోవాలని ఇన్‌చార్జి జిల్లా రెవెన్యూ అధికారి మురళీకృష్ణ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి ఆధార్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 ఏళ్ల లోపు వయసున్న వారి ఆధార్ నమోదు, అప్‌డేట్ వంద శాతం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. శిశువులు ఆధార్ పొందేలా ప్రభుత్వ, ప్రయివేట్ ఆస్పత్రుల్లో చర్యలు తీసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో ఆధార్ ప్రక్రియ పూర్తికి కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. 15 ఏళ్లలోపు పిల్లలకు ఆధార్ అప్‌డేట్ ఉచితంగా రెండుసార్లు చేయవచ్చని, విద్యా సంస్థలతో సమన్వయం చేసుకుని కార్యక్రమం పూర్తి చేయాలన్నారు. పూర్తి వివరాలకు టోల్ ఫ్రీ నంబర్ 1947ను సంప్రదించవచ్చన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీ తిప్పేస్వామి, డీఆర్‌డీఏ, పీడీ విద్యాసాగర్, గ్రామ వార్డు సచివాలయం ప్రత్యేక అధికారి వాసుదేవరావు, ఎల్‌డీఎం ఎం.సూర్యకిరణ్, అర్బన్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ జంపు కృష్ణమోహన్, తదితరులు పాల్గొన్నారు.

ఉలిక్కిపడ్డ సిక్కోలు



ఒడిశాలోని బహనాగా రైల్వేస్టేషన్‌లో పట్టాలపై తిరగబడిన బోగీల వద్ద సహాయక చర్యలు

- ఒడిశాలో రైలు ప్రమాదం
- భారీగా ప్రాణనష్టం
- జిల్లా ప్రయాణికులు ఉండొచ్చేమోనన్న అనుమానం
- హెల్ప్‌లైన్ నంబర్లతో అప్రమత్తం చేస్తున్న అధికారులు

సాక్షిప్రతినిధి, శ్రీకాకుళం: ఒడిశాలో రైలు ప్రమాదం జరగడంతో సిక్కోలు ఉలిక్కి పడింది. ఆగి ఉన్న గూడ్స్ రైలును కోరమండల్ ఎక్స్‌ప్రెస్ ఢీకొట్టి పట్టాలు తప్పడంతో పెను విషాదం చోటుచేసుకుంది. కోరమాండల్ బోగీలను యశ్వంత్‌పూర్- హౌరా ఎక్స్‌ప్రెస్ ఢీకొట్టింది. ఒడిశాలో బాలాసోర్‌కి 40 కిలోమీటర్ల సమీపంలో బాలేశ్వర్ జిల్లా బహనాగ రైల్వేస్టేషన్ వద్ద ప్రమాదం జరిగినట్లు రైల్వే అధికారుల నుంచి సమాచారం. ఈ ప్రమాదంలో 350 మంది గాయాలపాలవ్వగా 50 మందికి పైగా మృతి చెందినట్లు తెలిసింది. కోరమండల్ ఎక్స్‌ప్రెస్‌కు బరంపురం, విశాఖపట్నంలో హాల్ట్‌లు ఉన్నాయి. పలు స్టేషన్లలో శ్రీకాకుళం జిల్లాకు చెందిన ప్రయాణికులు ఎక్కే అవకాశం ఉంది. అలాగే యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్‌కు శ్రీకాకుళం రోడ్(ఆమదాలవలస), పలాస, బరంపురంలో హాల్ట్ ఉంది. రైళ్ల ఢీకొన్న సంఘటనలు తెలుసుకున్న సిక్కోలు ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. వేసవి సెలవులు కావడం, ప్రతి గ్రామంలో అమ్మవారి పండుగలు అధికంగా జరుగుతుండడంతో సుదూర ప్రాంతాల నుంచి పండగలకు, బంధువుల ఇళ్లకు రాకపోకలు సాగిస్తున్నారు. అలాగే చెన్నైకు నిర్మాణ పనుల కోసం వెళ్తుంటారు. ప్రమాదాన్ని తెలుసుకున్న రాష్ట్ర ప్రభుత్వం సంబంధిత జిల్లా కలెక్టర్లను అలెర్ట్ చేసింది. టోల్ ఫ్రీ నంబర్లు సిద్ధం చేసి ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకుని ప్రయాణికులకు కావాల్సిన సహకారం అందిస్తున్నట్లు సమాచారం. అటు రైల్వే అధికారులు, ఇటు జిల్లా అధికారులు ప్రయాణికులకు తగిన సాయం అందిస్తున్నారు.

- శ్రీకాకుళం పరిధిలో సమాచారం కోసం హెల్ప్ లైన్ నంబర్ 08942-286213, 08942-286245లకు నంబర్లకు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవచ్చు.
- పలాస పరిధిలో వారు 9866029078లకు సంప్రదించవచ్చు.
- సిక్కోలు జిల్లాకు సంబంధించి తక్కువమందే ప్రయాణికులు ఉంటే అవకాశాలు ఉండొచ్చని సమాచారం. అయినప్పటికీ ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండి తమ బంధువులు, స్నేహితుల వివరాలు తెలుసుకుంటే మంచిదని అధికారులు భావిస్తున్నారు.

రైళ్ల రద్దు.. దారి మళ్లింపు

ఒడిశాలో రైలు ప్రమాదం నేపథ్యంలో శ్రీకాకుళం జిల్లా మీదుగా వెళ్లాల్సిన రైళ్లను కొన్నింటిని రద్దు చేయడంతో పాటు మరికొన్నింటిని దారి మళ్లిస్తున్నట్లు ఈస్ట్ కోస్ట్ రైల్వే ఖుర్దా డివిజన్ ఉన్నత అధికారులు ప్రకటించారు. పలాస రైల్వే స్టేషన్‌లో అత్యవసర హెల్ప్‌లైన్ నంబర్ 986602978ను ఏర్పాటు చేశారు.



సహాయక చర్యల్లో రైల్వే సిబ్బంది

స్టాపేజీ లేకపోయినా..



శ్రీకాకుళం రోడ్ రైల్వేస్టేషన్‌లో ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ డెస్క్

ఆమదాలవలస: ఒడిశాలో రైలు ప్రమాదం నేపథ్యంలో హెల్ప్‌లైన్ డెస్క్ ఏర్పాటు చేసినట్లు శ్రీకాకుళం రోడ్(ఆమదాలవలస) రైల్వేస్టేషన్ మేనేజర్ ఎం.రవికుమార్ తెలిపారు. శ్రీకాకుళం రోడ్ రైల్వేస్టేషన్‌లో స్టాపేజ్ లేకపోవడంతో పూర్తిస్థాయి స్పష్టత రావడం లేదని, జిల్లాకు చెందిన ప్రయాణికులు కొన్నిసార్లు ఒడిశా రాష్ట్రం బరంపూర్‌లో దిగి జిల్లాకు వస్తుంటారని, మరి కొందరు విశాఖపట్నంలో దిగి జిల్లాకు వస్తుంటారని చెప్పారు. ఈ నేపథ్యంలో పలాస, శ్రీకాకుళం రోడ్ రైల్వేస్టేషన్‌లలో హెల్ప్‌లైన్ డెస్కులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లాకు సంబంధించి ఎవరైనా ఉంటే వెంటనే హెల్ప్‌లైన్ నంబర్లు 85911 85912, 85913 85914, బీఎస్ఎన్ఎల్ నెంబర్లు 08942 286213, 08942 286245కు సమాచారం అందించాలని కోరారు.



పలాస రైల్వేస్టేషన్‌లో హెల్ప్‌డెస్క్

హెల్ప్‌డెస్క్ నంబర్లు ఇవే..

బద్రక్	8455889900
జైపూర్ కెంజర్‌రోడ్డు	8455889906
కటక్	8455889917
భువనేశ్వర్	8455889922
ఖుర్దా రోడ్	6370108046
బరంపూర్	89173887241
హౌరా	03326382217
ఖరగ్‌పూర్	8972073925, 9332392339
బాలాసోర్	8249591559, 7978418322
షాలీమార్	9903370746
శ్రీకాకుళం	08942 286213, 45
పలాస	8978881006

● కరుణించమ్మా.. కనకదుర్గమ్మా..



జి.సిగడాం మండలం పెంట గ్రామంలో నూతనంగా నిర్మించిన కనకదుర్గ అమ్మవారి ఆలయ ప్రతిష్ఠాపనోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం మహిళలంతా ముగ్రాటలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి చల్లదనం చేశారు. గ్రామాన్ని చల్లగా చూడాలని వేడుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. - జి.సిగడాం

అరుణాచల గిరి ప్రదక్షిణకు పయనం



జెండా ఊపి బస్సును ప్రారంభిస్తున్న జిల్లా ప్రజారవాణా అధికారి విజయ్‌కుమార్

శ్రీకాకుళం అర్బన్: వేసవి సెలవుల సందర్భంగా ఏపీఎస్ ఆర్టీసీ నడుపుతున్న ప్రత్యేక సర్వీసులను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రజారవాణా అధికారి ఎ.విజయ్‌కుమార్ కోరారు. శ్రీకాకుళం ఆర్టీసీ బస్‌స్టేషన్ నుంచి అరుణాచల గిరి ప్రదక్షిణ విహారయాత్రకు బయలుదేరిన సూపర్ లగ్జరీ ప్రత్యేక సర్వీసును శుక్రవారం జండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు రోజుల యాత్రలో భాగంగా కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి ఆలయం, శ్రీపురంలోని గోల్డెన్ టెంపుల్ దర్శనం తదనంతరం అరుణాచల గిరిప్రదక్షిణ చేసుకొని తిరుగు ప్రయాణంలో కంచి, శ్రీకాళహస్తి ఆలయాల దర్శనం ఉంటుందని చెప్పారు. మంగళవారం ఉదయం శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్‌కు బస్సు చేరుకుంటుందన్నారు. ప్రయాణ చార్జి రూ.4500 వసూలు చేస్తున్నట్లు తెలిపారు. జూలై 1, జూలై 30వ తేదీల్లోనూ ఈ ప్రత్యేక సర్వీసులు అరుణాచలానికి బయలుదేరుతాయని చెప్పారు. జిల్లావాసులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆన్‌లైన్‌లో ఏపీఎస్‌ఆర్‌టీసీఆన్‌లైన్.ఇన్ వెబ్‌సైట్‌లో టికెట్లు బుక్ చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ శ్రీకాకుళం ఒకటో డిపో మేనేజర్ కె.మాధవ్, అసిస్టెంట్ మేనేజర్ వి.రమేష్, ఎస్ఎం సన్యాసిరావు, టీఐ-3 ఎల్ఎస్ నాయుడు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

టైరుబండితో తొక్కించి వ్యక్తి హత్య



సదాశివుని రాజేష్ (ఫైల్)

శ్రీకాకుళం రూరల్: అరసవల్లిలోని శ్రీలక్ష్మీగార్డెన్స్‌లో నివాసముంటున్న సదాశివుని రాజేష్ (38) గురువారం అర్ధరాత్రి హత్యకు గురయ్యాడు. రూరల్ ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు.. ఒడిశా రాష్ట్రం రాయగడకు చెందిన బలరామ్ హిమల్, అప్పలరాజు గార మండలం జొన్నలపాడులో నివాసముంటూ ఖాజీపేట పరిసర ప్రాంతంలో కొద్ది నెలలుగా ఇసుక వ్యాపారం చేస్తున్నారు. ప్రతిరోజూ రాత్రి నాగావళి నది నుంచి టైరుబండి ద్వారా ఇసుకను తీసుకొస్తూ పరిసర ప్రాంతాల్లో విక్రయిస్తుండేవారు. ఈ క్రమంలో ఒప్పంగిలో బేరం కుదరడంతో గురువారం రాత్రి 12 గంటల సమయంలో వీరిద్దరూ రెండు వేర్వేరు టైరుబళ్ల ద్వారా ఇసుకను తీసుకెళ్తున్నారు. ఈ సమయంలో అరసవల్లికి చెందిన సదాశివుని రాజేష్ అడ్డగించాడు. ఎక్కడి నుంచి తీసుకెళ్తున్నారని, అనుమతులు ఎవరు ఇచ్చారని వారితో వాగ్వాదానికి దిగాడు. ఈ విషయాన్ని స్నేహితులకు ఫోన్‌లో వివరించాడు. ఈ క్రమంలో అప్పలరాజు ముందుగా వెళ్లిపోయాడు. వెనుకనే ఉన్న బలరామ్ హిమల్ తనతో తీవ్ర వాదనకు దిగిన రాజేష్‌ను కిందకు నెట్టేసి టైరుబండితో పైనుంచి ఎక్కించుకుపోయాడు. ఈ ఘటనలో రాజేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఈలోగా అక్కడికి చేరుకున్న స్నేహితులు రక్తపు మడుగులో ఉన్న రాజేష్‌ను రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే రాజేష్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడు ఆపరేటివ్ డ్రైవర్‌గా పనిచేయగా, భార్య ఇందు ఉన్నారు.. మృతుడి తండ్రి కాశీనాథరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడు బలరామ్‌ను అదుపులోకి తీసుకున్నారు.

ఒకే కుటుంబానికి రూ.30 వేల పింఛన్



పింఛన్ నగదు అందిస్తున్న దృశ్యం

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని 28వ వార్డుకు చెందిన ఒకే కుటుంబానికి చెందిన పాలక కుమారి(తల్లి), పాలక చిన్ని(కుమారుడు), బొచ్చా లావణ్య(మేనకోడలు) సికిల్‌సెల్ అనీమియా వ్యాధి బారిన పడ్డారు. వీరికి ప్రభుత్వం రూ.10 వేలు చొప్పున పింఛన్ మంజూరు చేయడంతో మొత్తం రూ.30 వేల నగదును శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ బొనెల చంద్రమ్మ, వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బోనెల రాము, వెల్ఫేర్ సెక్రటరీ వైకుంఠరావు, బోనెల గణపతి, మిన్ను, గృహ సారథులు జగన్, స్వాతి, వలంటీర్ చైతన్య పాల్గొన్నారు.

150 అడుగులు ముందుకొచ్చిన సముద్రం

- మంచినీళ్లపేటలో కోతకు గురవుతున్న తీరం

వజ్రపుకొత్తూరు: మండలంలోని మంచినీళ్లపేట తీరంలో అలల కల్లోలం ఎక్కువైంది. రోజురోజుకూ తీరం కోతకు గురవుతుండటంతో మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వారం రోజులుగా తీరం కల్లోలంగా మారి బురదతో కూడిన అలల తాకిడి ఎక్కువైంది. దీంతో సాధారణం కంటే 150 అడుగుల ముందుకు సముద్రం వచ్చింది. దాదాపు రెండు కిలోమీటర్ల మేర తీరం కోతకు గురవుతోంది. దేవునల్తాడ, కంబాలరాయుడుపేట, డోకులపాడు, దిబ్బవానిపేటలో అలల ఉధృతి పెరిగిందని మత్స్యకారులు కె.మోహనరావు, కొండరాజులు, గుంటు ధనరాజు, వల్లభరావు చెబుతున్నారు. తీరంలో చెట్లు సైతం కూలిపోయాయి. లంగరు వేసిన బోట్లను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు.



అలల ఉధృతికి కోతకు గురువుతున్నతీరం

సాంకేతిక సేద్యంతో అధిక దిగుబడులు

- రైతు ఖాతాల్లోకి సబ్సిడీ నగదు జమ
- వైఎస్సార్ యంత్ర సేవా పథకం ప్రారంభోత్సవంలో స్పీకర్ తమ్మినేని, మంత్రి ధర్మాన
- జిల్లాలో 328 సీహెచ్‌సీ గ్రూప్‌లకు రూ.12.95 కోట్ల రాయితీ



కోడిరామ్మూర్తి స్టేడియంలో ట్రాక్టర్‌ను డ్రైవ్ చేస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం. చిత్రంలో మంత్రి ధర్మాన, ఎమ్మెల్యే రెడ్డి శాంతి తదితరులు (ఇన్‌సెట్లో) నమూనా చెక్కు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): శాస్త్ర సాంకేతిక పద్ధతులు వినియోగిస్తూ వ్యవసాయం చేయడం ద్వారా రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చని శాసన సభాపతి తమ్మినేని సీతారాం, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. శుక్రవారం డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కళా వేదికలో డాక్టర్ వైఎస్సార్ యంత్ర సేవా పథకంలో భాగంగా ట్రాక్టర్లు, హార్వెస్టర్లు, ఇతర వ్యవసాయ యంత్ర పరికరాలను రైతులకు పంపిణీ చేశారు. తొలుత సీఎం జగన్ మోహన్‌రెడ్డి వర్చువల్ విధానం ద్వారా గుంటూరు నుంచి ఈ కార్యక్రమం ప్రారంభించారు. బటన్ నొక్కి డీబీటీ పద్ధతిలో నేరుగా రైతుల బ్యాంకు ఖాతాలకు సబ్సిడీ జమచేశారు. అనంతరం స్పీకర్, మంత్రి మాట్లాడుతూ వ్యవసాయం గిట్టుబాటు కాని పరిస్థితుల్లో రాజశేఖర్ రెడ్డి కుటుంబం రైతుల అభ్యున్నతిపై దృష్టి సారించిందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక పూర్తిస్థాయిలో రైతులకు అండగా నిలుస్తోందన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా రైతు భరోసా కేంద్రాల ద్వారా సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. రైతులు యాంత్రీకరణ సేవలు వినియోగించుకొని దిగుబడులు పెంచే దిశగా అడుగులు వేయాలన్నారు. విత్తనం నుంచి విక్రయం వరకు రైతు భరోసా కేంద్రాలు ద్వారా జరుగుతుందన్నారు. ట్రాక్టర్ల పంపిణీ పారదర్శకంగా జరిగిందన్నారు.

- ఇన్‌చార్జి కలెక్టర్ ఎం.నవీన్ మాట్లాడుతూ రైతుల వలసలు తగ్గించి వారి ఆదాయం పెంచాలనేదే యంత్రసేవా పథకం ముఖ్య ఉదేశమన్నారు. ట్రాక్టర్లు, ఆధునిక యంత్ర పరికరాలు రైతు సంఘాలకు అందజేయడం శుభపరిణామమన్నారు. రెండో విడతలో రూ.37.38 కోట్ల విలువైన 269 ట్రాక్టర్లు, 37 ఇంప్లిమెంట్స్, 22 హార్వెస్టర్లను కమ్యూనిటీ హైరింగ్ సెంటర్ల కింద పనిచేయనున్న 308 రైతు సంఘాలకు పంపిణీ చేసినట్లు వివరించారు. యూనిట్లు పొందుతున్న సంఘాలకు రూ.12.94 వరకు సబ్సిడీ అందజేసినట్లు తెలిపారు. ఇచ్ఛాపురంలో 34, పలాసలో 41, టెక్కలిలో 44, నరసన్నపేటలో 57, శ్రీకాకుళంలో 17, ఎచ్చెర్లలో 45, ఆమదాలవలసలో 35, పాతపట్నంలో 58 రైతు సంఘాలకు యంత్ర సేవా పరికరాలు అందజేసినట్లు వివరించారు. యంత్రాలను అద్దె ప్రాతిపదికన సన్న, చిన్న కారు రైతులు వినియోగించుకోవచ్చన్నారు.
- డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలో 328 సీహెచ్‌సీ గ్రూపుల్లోని రైతులకు సబ్సిడీపై రుణాలు మంజూరు చేసినట్లు చెప్పారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా విత్తనాలు, ఎరువులు సరఫరా చేస్తున్నట్లు వివరించారు. రైతులు వాణిజ్య పంటలపై దృష్టి సారించాలన్నారు. అనంతరం రైతు సంఘాలకు నమూనా చెక్కు అందజేశారు. కోడి రామ్మూర్తి స్టేడియంలో జెండా ఊపి రైతులు, రైతు సంఘాలకు, ట్రాక్టర్లు, ఆధునిక యంత్ర పరికరాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్, పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి, కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ నేతాజీ, గొండు రఘురామ్, కళింగ కోమటి కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, కాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్, రొక్కం సూర్యప్రకాష్, ఎంపీపీలు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆదిత్యాలయానికి ఫైర్‌సేఫ్టీ పరికరాల వితరణ



ఫైర్ సేఫ్టీ పరికరాలతో దాత, ఈవో, ప్రధానార్చకులు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో అన్నదాన విభాగంలో వినియోగించేందుకు వీలుగా రూ.25 వేల విలువైన ఫైర్ అండ్ సేఫ్టీ పరికరాలను బి.అనంతరావు అనే భక్తుడు వితరణగా అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో వి.హరిసూర్యప్రకాష్, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ, సీనియర్ అసిస్టెంట్ జి.ఎ.వి.ఎల్.ఎన్ కృష్ణమాచార్యులు, నేతేటి హరిప్రసాద్ శర్మ పాల్గొన్నారు.

108 వాహన సిబ్బంది ఔదార్యం



ఆస్పత్రికి సిబ్బందికి వస్తువులు అందిస్తున్న 108 సిబ్బంది

కంచిలి: కంచిలి మండల 108 అంబులెన్స్ సిబ్బంది విధి నిర్వహణలో ఓ వ్యక్తి ప్రాణాలు కాపాడటంతో పాటు అతని విలువైన వస్తువులను నిజాయితీగా ఆస్పత్రి సిబ్బందికి అందించారు. పలాస మండలం మొగిలికొత్తూరుకు చెందిన కొమ్మరి లోకేష్ అనే తాపీమేస్త్రీ పలాస నుంచి ఇచ్ఛాపురం మండలం సీమూరు గ్రామానికి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా జక్కర గ్రామ కూడలి వద్ద గురువారం రాత్రి 11.30 గంటల సమయంలో 'సిమొకోసియస్ స్టేజ్' అనే వ్యాధి కారణంగా అపస్మార స్థితికి చేరుకున్నాడు. సమాచారం అందిన వెంటనే 108 అంబులెన్స్ సిబ్బంది తిరుపతిరావు, ఎస్.రామారావు ఘటనా స్థలానికి చేరుకొని బాధితుడికి సపర్యలు చేసి సోంపేట సామాజిక ఆసుపత్రిలో చేర్పించారు. బాధితునికి చెందిన రూ.10,330 నగదు, మొబైల్‌ఫోన్, బైక్ తాళాలను ఆస్పత్రి సిబ్బందికి అందజేశారు.

ఆర్అండ్‌బీ ఎస్ఈగా జాన్ సుధాకర్



జాన్ సుధాకర్‌ను మర్యాదపూరకంగా కలిసిన ఈఈ సత్యనారాయణ

శ్రీకాకుళం: ఆర్అండ్‌బీ ఎస్ఈగా కె.జాన్ సుధాకర్ శుక్రవారం విధుల్లో చేరారు. ప్రభుత్వం చేపట్టిన సాధారణ బదిలీల్లో భాగంగా శ్రీకాకుళం ఆర్అండ్‌బీ ఎస్‌గా పనిచేసిన కె.కాంతిమతి విశాఖపట్నానికి బదిలీపై వెళ్లారు. విశాఖలో పనిచేస్తున్న కె.జాన్ సుధాకర్ బదిలీపై శ్రీకాకుళం వచ్చారు. జాన్ సుధాకర్‌ను ఈఈ పి.సత్యనారాయణ, ఎస్.రవినాయక్ సిబ్బంది కలిసి అభినందనలు తెలియజేశారు.

14న జిల్లాస్థాయి పోటీలు

శ్రీకాకుళం కల్చరల్: జూన్ 14న ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా పాఠశాల, కళాశాలల్లో జేఆర్‌సీ, వైఆర్‌సీ విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తున్నట్లు రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 'స్వచ్ఛంద రక్తదానం- ఆవశ్యకత' అనే అంశంపై ఈ నెల 10లోగా ఆయా స్కూళ్లు, కళాశాలలో పోటీలు నిర్వహించి ఎంట్రీలను జిల్లా స్థాయి కమిటీకి పంపించాలని కోరారు. వారిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను ఎంపిక చేస్తామని తెలిపారు. 14న బాపూజీ కళామందిర్‌లో సర్టిఫికెట్లు అందజేస్తామని చెప్పారు. అదే విధంగా, 50 పర్యాయాలకు మించి రక్తదానం చేసిన వారికి సత్కారం చేస్తామని పేర్కొన్నారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	60,760-00
బంగారం(22సి. 10గ్రా.)	55,700-00
వెండి (కిలో)	77,600-00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 515.00
విజయనగరం	రూ.519.00
శ్రీకాకుళం	రూ.519.00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹152	₹274	₹ 284

పశు బీమా.. రైతుకు ధీమా!



గొర్రెలు, మేకల మంద

- ఒకసారి బీమా ప్రీమియం చెల్లిస్తే మూడేళ్ల కాలపరిమితి
- 21 రోజుల్లోపే పరిహారం చెల్లింపు
- సద్వినియోగం చేసుకోవాలంటున్న అధికారులు



పాడి రైతులకు అవగాహన కలిగిస్తున్న అధికారులు

ఎల్.ఎన్.పేట: జిల్లాలో గ్రామీణ ప్రాంత రైతులు వ్యవసాయం తర్వాత పాడి పరిశ్రమకే అధిక ప్రాధాన్యమిస్తారు. అయితే పశుపోషణ సవాళ్లతో కూడుకుంటుంది. ఈ నేపథ్యంలో జీవాల పెంపకందారులకు ఆర్థికంగా ప్రయోజనం చేకూరేలా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. పాడి పరిశ్రమలో పాడి, దుక్కి పశువులు, గేదెలు, ఆవులు, గొర్రెలు, మేకలు, నాటుకోళ్లు వీటినే నమ్ముకుని జీవనం సాగిస్తున్న రైతులకు భరోసా కల్పిస్తూ ప్రభుత్వం 'వైఎస్సార్ పశుబీమా పథకాన్ని' అమల్లోకి తెచ్చింది. పలు రకాల వ్యాధులు, ప్రకృతి వైపరీత్యాలు, ప్రమాదవశాత్తు, సహజ సిద్ధంగా మృతి చెందిన వాటికి బీమా చెల్లించేందుకు ప్రభుత్వం కంపెనీలతో ఒప్పందం కుదుర్చుకుంది.

జిల్లాలో పరిస్థితి..	
ఆవులు	4,56,291
గేదెలు	40,477
మేకలు	6,23,641
గొర్రెలు	2,77,909

ప్రీమియం చెల్లింపు ఇలా..

- తెలుపు రేషన్ కార్డు కలిగిన నిరుపేద రైతులు తమ వాటా కింద 20 శాతం, ఇతర రైతులు (రేషన్ కార్డు లేనివారు) 50 శాతం ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది.
- దేశవాళి, సంకరజాతి పశువులకు మూడేళ్ల బీమా కాలానికి రూ.30 వేలు బీమా మొత్తం కాగా తెలుపు రేషన్ కార్డు లేని రైతు రూ.960, కార్డు ఉన్న రైతు రూ.384 చెల్లించాలి.
- నాటు జాతి పశువులు మూడేళ్ల బీమా కాలానికి రూ.15వేలు బీమా మొత్తం కాగా తెలుపు రేషన్ కార్డు లేని రైతు రూ.480, కార్డు ఉన్న రైతు రూ.192 చెల్లించాలి.
- గొర్రెలు, మేకలు, పందులకు ఏడాదికి బీమా మొత్తం రూ.6 వేలు ఉంది. తెలుపు రేషన్ కార్డు లేని రైతు రూ.90, కార్డు ఉన్న రైతు రూ.36లు, రెండేళ్ల కాల పరిమితికి తెలుపు రేషన్ కార్డు లేని రైతు రూ.135, కార్డు కార్డు ఉన్న రైతు రూ.54, మూడేళ్ల కాలపరిమితికి తెలుపు రేషన్ లేని రైతు రూ.187.50, కార్డు ఉన్న రైతు రూ.75 చెల్లించాలి.

జీవాలు మరణిస్తే..

పశువులు, జీవాలు ఏదైనా కారణంతో మరణిస్తే వెంటనే పశువైద్య శాఖ అధికారులకు తెలియజేయాలి. రైతు ముందుగా చెల్లించిన కాలపరిమితిని, చెల్లించిన బీమా ప్రీమియంను పరిగణనలోకి తీసుకుని పరిహారం చెల్లిస్తారు. ఆరు నెలలు, ఆపైబడిన వయసు కలిగిన జీవాలు (ఒక కుటుంబానికి 50 మాత్రమే) మరణిస్తే రూ.6వేలు చెల్లిస్తారు. దేశవాళీ పశువులకు రూ.30వేలు, నాటు పశువులకు రూ.15వేలు బీమా (ఒక కుటుంబానికి 5 పశువులకు) వస్తుంది. మరణించిన 21 రోజుల్లో బీమా మొత్తం రైతు బ్యాంకు ఖాతాలో జమవుతుంది. ప్రభుత్వ నిబంధనలు కాకుండా పూర్తి స్థాయిలో బీమా చెయించుకుంటే పశువులకు రూ.1.20 లక్షలు, జీవాలకు రూ.15 వేలు బీమా వర్తిస్తుంది.

అవగాహన కల్పిస్తున్నాం



వైఎస్సార్ పశుబీమా పథకం పాడి రైతులకు మేలు చేకూర్చేలా ఉంది. పశువులు, జీవాలు మరణించిన 21 రోజుల్లోనే బీమా మొత్తం రైతు బ్యాంకు ఖాతాకు జమవుతుంది. బీమా పథకంపై రైతులకు అవగాహన కలిగిస్తున్నాం. పశువులు, జీవాలు మరణిస్తే బాధిత రైతులు గ్రామ సచివాలయంలో ఉన్న వెటర్నరీ సహాయకులు, పశు వైద్య శాల డాక్టర్‌కు తెలియజేయాలి.

– ఎం.లోకనాథం, ఎ.డి. పశుసంవర్ధక శాఖ, కోటబొమ్మాళి

బీమా చెల్లించా



మాకు మేకలు, గొర్రెల మంద ఉంది. బీమా చెల్లించాలని పశువుల డాక్టర్‌తో పాటు గ్రామ సచివాలయం సిబ్బంది, గోపాల మిత్రలు చెప్పారు. మేకలు, గొర్రెల మందకు బీమా చెల్లించాను. మా కోసం అధికారులు, నాయకులు ఆలోచన చేయటం గొప్ప విషయం.

– బొమ్మాళి సిమ్మన్న, గొర్రెల మంద కాపరి, కృష్ణాపురం, ఎల్.ఎన్.పేట

● జ్ఞాపకాల ఒడిలో..



శ్రీకాకుళం రూరల్ మండల పరిధిలోని సింగుపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1993–94 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు శుక్రవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సింగుపురం, బైరి పరిసర ప్రాంతాలకు చెందిన పూర్వ విద్యార్థులంతా ఒకే చోటకు చేరి ఆనాటి జ్ఞాపకాలను ఒకరితో ఒకరు పంచుకున్నారు. అప్పటి గురువులకు పాదాభివందనం చేస్తూ వారిని ఘనంగా సన్మానించారు. - శ్రీకాకుళం రూరల్

మెగా ఉద్యోగ మేళాకు విశేష స్పందన



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ విద్యాసాగర్

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళంలో నిర్వహించిన మెగా ఉద్యోగ మేళాకు విశేష స్పందన లభించింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శ్రీకాకుళం అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి స్థానిక ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో సిల్వర్ జూబ్లీ ఆడిటోరియం వేదికగా శుక్రవారం మెగా జాబ్ మేళా నిర్వహించారు. 15 ప్రైవేటు సంస్థలు పాల్గొనగా, 533 మంది నిరుద్యోగ యువతీ యువకులు హాజరయ్యారు. ఆయా కంపెనీ ప్రతినిధులు నిర్వహించిన లిఖిత, మౌఖికపరమైన పరీక్షలు, ఇంటర్వ్యూల్లో ప్రతిభకనబర్చిన 209 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు.

ఉపాధి కల్పనే లక్ష్యం..

నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం అనేక కార్యక్రమాలను రూపొందించిందని డీఆర్‌డీఏ పీడీ డి.వి.విద్యాసాగర్ అన్నారు. చదువుతోపాటు నైపుణ్యాలను అందిపుచ్చుకోవాలన్నారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పీటీ సాయి శ్రీనివాస్ మాట్లాడుతూ ఎంపిక కాని అభ్యర్థులు నిరాశ చెందవద్దన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన స్కిల్ హబ్స్ ట్రైనింగ్‌లో చేరి నైపుణ్యాలను పెంచుకోవాలని సూచించారు. జిల్లాలో నియోజకవర్గానికి ఒకటి చొప్పున మొత్తం 8 స్కిల్ హబ్స్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పదవ తరగతి, ఆపైన చదివిన వారు ఈ కోర్సుల్లో చేరి నైపుణ్యాన్ని పెంచుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధి అధికారి కె.సుధ, స్థానిక ప్రిన్సిపాల్ పి.సురేఖ, సెట్‌శ్రీ సీఈఓ బి.వి.ప్రసాదరావు, జిల్లా పర్యాటక అధికారి ఎన్.నారాయణరావు, కళాశాల నోడల్ జె.కె.సి కోఆర్డినేటర్ పైడితల్లి, బి.చంద్రమౌళి, ప్లేస్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ ఎం.వంశీకృష్ణ, వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

హరిపురం విద్యార్థినికి బంగారు పతకం



గవర్నర్ చేతుల మీదుగా పతకాన్ని అందుకుంటున్న రుచిత

మందస: మండలంలోని హరిపురం గ్రామానికి చెందిన అడ్డాల రుచిత ఇంజినీరింగ్‌లో మంచి ప్రతిభ కనబరిచి రాష్ట్ర గవర్నర్ జస్టిస్‌సయ్యద్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా ఇటీవల బంగారు పతకం అందుకుంది. సామాన్య కుటుంబానికి చెంది అడ్డాల దామోదరం, భారతిల కుమార్తె రుచిత జేఎన్‌టీయూ(కాకినాడ)లో ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్(ఈఈఈ) విభాగంలో గరిష్టమార్కులు(సీజీపీ 8.66) సాధించింది. యూనివర్సిటీ స్నాతకోత్సవంలో భాగంగా గవర్నర్ చేతుల మీదుగా బంగారు పతకం అందుకుంది.

రుచిత 10వ తరగతిలో 10పాయింట్లు సాధించగా, ఇంటర్‌మీడియట్‌లో 989/1000 మార్కులు పొందింది. ఏపీ ఎంసెట్‌లో 1137వ ర్యాంకు సాధించి జేఎన్‌టీయులో చదువుతోంది. కాగా, రుచిత ప్రస్తుతం ఎల్అండ్‌టీలో ఎలక్ట్రికల్ ఇంజనీర్(తమిళనాడు)గా ఎంపికయ్యారు. భవిష్యత్‌లో సివిల్స్ సాధించడమే లక్ష్యమని రుచిత తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వస్త్రవ్యాపారి దుర్మరణం



ఘటనా స్థలం వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు




శాంతారావు (ఫైల్)

ఆమదాలవలస : పట్టణంలోని రైల్వేస్టేషన్ జంక్షన్ వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో స్థానిక లక్ష్మీనగర్ వీధికి చెందిన శాంతామణి టెక్స్‌టైల్స్ వ్యాపారి అమనాన శాంతారావు(72) మృతిచెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇంటికి కూరగాయలు తీసుకువస్తానని సైకిల్‌పై బయల్దేరి వెళ్లిన శాంతారావును కొత్తూరు నుంచి శ్రీకాకుళం వెళ్తున్న బస్సు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందారు. డ్రైవర్ తప్పిదం వల్ల ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు చెబుతున్నారు. ఓవైపు ఫుట్‌పాత్‌పై వ్యాపారాలు జరుగుతుండటం, అక్కడికి వచ్చిన వాహనదారులు రోడ్డుపైనే వాహనాలు పార్కింగ్ చేసి ఉండటం, డ్రైవర్ ఒక్కసారిగా కుడివైపున బస్సును నడిపించడంతో శాంతారావు బస్సు వెనుక చక్రం కింద పడి తల నుజ్జునుజ్జయ్యింది. మృతుడికి భార్య జయభారతి, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ముగ్గురికీ వివాహాలయ్యాయి. ఆమదాలవలస ఎస్ఐ వై.కృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. శాంతారావుకు ఆమదాలవలస నియోజకవర్గంలో మంచి వ్యాపారిగా పేరు ఉంది. ఈయన మృతి పట్ల ఆమదాలవలస క్లాత్ అండ్ రెడీమేడ్ వస్త్ర వ్యాపారుల సంఘం నాయకులు జె.కె.వెంకటేశ్వరరావు, కె.శ్యాంప్రసాద్ తదితరులు సంతాపం తెలిపారు.

రోడ్డుపైన వ్యాపారాల వల్లే..

ఇరుకైన రహదారిలో రోలింగ్ నిర్మాణం, ఫుట్‌పాత్ వ్యాపారులు రహదారిపైకి వచ్చి వ్యాపారం చేయడం వంటి కారణాల వల్ల ఈ ప్రాంతంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు.పోలీసులు, మున్సిపల్ అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

వివాహిత ఆత్మహత్య



పోలా భాను మృతదేహం

కాశీబుగ్గ: పలాస -కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని గాంధీనగర్‌లో వివాహిత పోలా భాను(28) ఆత్మహత్యకు పాల్పడింది. శుక్రవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుంది. మృతురాలి భర్త స్థానికంగా పెయింటింగ్ పనులు చేస్తున్నారు. భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవని, శుక్రవారం ఉదయం సైతం గొడవ పడ్డారని స్థానికులు చెబుతున్నారు. విషయం తెలుసుకున్న డీఎస్పీ నాగిరెడ్డి, సీఐ శ్రీనివాస్ ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలాస ప్రభుత్వ సామాజిక ఆసుపత్రికి తరలించారు. కాశీబుగ్గ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమ మద్యం విక్రయిస్తే రూ.2 లక్షల జరిమానా

సారవకోట: అక్రమంగా మద్యం నిల్వలున్నా, విక్రయించినా రూ.2 లక్షలు జరిమానా విధిస్తానని సారవకోట తహశీల్దార్ ప్రవల్లికా ప్రియ హెచ్చరించారు. శుక్రవారం పాతపట్నం సెబ్ అధికారులు మండలానికి చెందిన 8 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒకసారి బైండోవర్ కేసు నమోదై మళ్లీ అక్రమంగా మద్యం విక్రయిస్తే రూ.2 లక్షలు జరిమానా విధిస్తానని స్పష్టం చేశారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

నరసన్నపేట: మండలంలోని ఉర్లాం రైల్వే స్టేషన్ సమీపంలో శుక్రవారం ఉదయం గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం గుర్తించామని రైల్వే హెచ్‌సీ ఎస్.మధుసూదనరావు తెలిపారు. 65 ఏళ్ల వయసు ఉండవచ్చని, తెల్లటి పంచె ధరించాడని, చామన ఛాయలో ఆరు అడుగుల పొడవు ఉంటాడని పేర్కొన్నారు. గుర్తు తెలియని రైలు ఢీకొనగా మృతి చెందినట్లు భావిస్తున్నామని పేర్కొన్నారు. వివరాలు తెలిసిన వారు ఆమదాలవలస రైల్వే పోలీసులను సంప్రదించాలని సూచించారు.

వివాహిత అదృశ్యం

శ్రీకాకుళం క్రైమ్ : నగరంలోని కృష్ణాపార్కు వద్ద వివాహిత అదృశ్యమైనట్లు శ్రీకాకుళం రెండో పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్ఐ వి.సందీప్‌కుమార్ తెలిపారు. ఎచ్చెర్ల మండలం ఎస్ఎస్ఆర్‌పురానికి చెందిన యువకునితో లావేరు మండలానికి చెందిన యువతితో పదిహేను రోజుల క్రితం వివాహం జరిగింది. భర్త వ్యవసాయం చేస్తుండేవాడు.

గత నెల 31న (మూడురోజుల క్రితం) నవదంపతులు దుస్తులను డ్రైవాష్ చేయించేందుకు కృష్ణాపార్కు సమీపంలో షాప్ వద్దకు వచ్చారు. అక్కడే ఆమె అదృశ్యమైనట్లు భర్త శుక్రవారం రాత్రి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

ఉపాధి రికార్డుల పరిశీలన

సాక్షి ఎఫెక్ట్...

సంతబొమ్మాళి: మండలంలోని మర్రిపాడు పంచాయతీలో ఉపాధి పనులకు సంబంధించిన రికార్డులను డ్వామా పీడీ మురళీకృష్ణ పరిశీలించారు. 'ఇదేం పని' శీర్షికన శుక్రవారం 'సాక్షి'లో కథనం ప్రచురితం కావడంతో అధికారులు స్పందించారు. గ్రామ సచివాలయానికి వెళ్లి వివరాలు నమోదు చేశారు. వేతనదారులు వేరే పనులకు వెళ్లిపోవడంతో వారి నుంచి వివరాలను సేకరించలేదని, మరో రోజు వచ్చి వేతనదారులు స్టేట్‌మెంట్ నమోదు చేస్తామని ఏపీడీ తెలిపారు.

4న జిల్లా జూనియర్స్ బాక్సింగ్ ఎంపికలు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా జూనియర్స్ బాలబాలికల బాక్సింగ్ ఎంపిక పోటీలు ఈ నెల 4న జరగనున్నాయని జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి బి.ఎ.లక్ష్మణ్‌దేవ్ ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళం కోడిరామ్మూర్తి స్టేడియం ప్రాంగణంలో ఆదివారం ఉదయం 7 గంటలకు ఎంపికలు మొదలవుతాయని పేర్కొన్నారు. 44 నుంచి 80 కేజీల విభాగాల మధ్య ఎంపిక పోటీలు జరుగుతాయని చెప్పారు. 2007 జనవరి 1 నుంచి 2008 డిసెంబర్ 31 మధ్య జన్మించిన వారు అర్హులని స్పష్టంచేశారు. ఎంపికైన క్రీడాకారులను ఎన్టీఆర్ జిల్లా విజయవాడలో ఈ నెల 9 నుంచి 11 వరకు జరిగే ఏపీ రాష్ట్ర జూనియర్స్ బాక్సింగ్ చాంపియన్‌షిప్-2023 పోటీలకు పంపిస్తామని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 89774 96979 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

4న సత్యసాయి సేవాసమితి జిల్లా సమావేశం



లింగరాజు సత్యసేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు

హిరమండలం: పాతపట్నంలో ఈ నెల 4న సత్యసాయి సేవా సమితి జిల్లాస్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు వై.లింగరాజు మాస్టర్ తెలిపారు. శుక్రవారం స్థానిక ప్రేమ సాయి వృద్ధాశ్రమాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం 10 గంటలకు జరిగే సమావేశానికి జిల్లాలోని అన్ని సత్యసేవా సమితుల కన్వీనర్లు, భజన మండలి కన్వీనర్లు, జోనల్ కన్వీనర్లు, జిల్లా పదాధిపతులు, కోఆర్డినేటర్లు, క్రియాశీలక సభ్యులు విధిగా హాజరుకావాలన్నారు. ఆధ్యాత్మిక, విద్యా సేవ, యువజన విభాగాల సేవలతో పాటు ఆగస్టులో నిర్వహించనున్న 20వ పర్తి యాత్రపై చర్చిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆశ్రమ కోఆర్డినేటర్ ఎస్.సాయిబాబా, అభివృద్ధి కమిటీ సభ్యులు జ్యోషు గోవిందశర్మ, చంటి మాస్టర్ పాల్గొన్నారు.

గిరిజనుడి నిజాయితీ

కాశీబుగ్గ: కాశీబుగ్గలోని బ్యాంక్ ఆఫ్ ఇండియాలో అదనంగా రూ.20 వేలు ఇచ్చిన క్యాషియర్‌కు తిరిగి నగదు అందజేసిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. కొండలోగాం గ్రామానికి చెందిన సవర ఆనందరావు ఓ జీడి పరిశ్రమ యజమాని వద్ద గుమస్తాగా పనిచేస్తున్నారు. రెండు వేల రూపాయల నోట్లు మార్చడానికి బ్యాంకుకు రాగా, రూ.20 వేల నగదుకు బదులు రూ.40 వేలను క్యాషియర్ పొరపాటున ఇచ్చేశారు. గుమస్తా పరిశ్రమకు వెళ్లి చూడగా అదనంగా వచ్చిన నగదు గుర్తించారు. అనంతరం బ్యాంకు అధికారులకు నగదు అప్పగించారు. యువకుడి నిజాయితీని బ్యాంకు సిబ్బంది అభినందించారు.

మూల్యాంకన కేంద్రం పరిశీలన

శ్రీకాకుళం న్యూకాలనీ: ఇంటర్మీడియెట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల జవాబుపత్రాల మూల్యాంకనంలో పాల్గొంటున్న అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆర్జేడీ శారద సూచించారు. శుక్రవారం శ్రీకాకుళం ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో జరుగుతున్న స్పాట్ కేంద్రాన్ని తనిఖీ చేశారు. దిద్దుబాటు తీరు, మార్కుల కేటాయింపు, బబ్లింగ్ చేయడాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. మౌలిక సదుపాయాలను ఎగ్జామినర్లు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆర్ఐఓ ఎస్.తవిటినాయుడు, జనరల్ 1, 2 బి.శ్యామ్‌సుందర్, కె.తవిటినాయుడు, ఏసీవోలు పాల్గొన్నారు.

గాయత్రి కాలేజీకి నాక్ ఏ ప్లస్ గ్రేడ్



సమావేశమైన కాలేజీ యాజమాన్యం

శ్రీకాకుళం/శ్రీకాకుళం రూరల్: మునసబుపేటలోని గురజాడ విద్యాసంస్థల అనుబంధ సంస్థ గాయత్రి కాలేజీ ఆఫ్ సైన్సు అండ్ మేనేజ్‌మెంట్ కళాశాలకు నాక్ ఏ ప్లస్ గ్రేడ్ లభించిందని విద్యాసంస్థల అధినేత జి.వి.స్వామినాయుడు శుక్రవారం తెలిపారు. గత నెల 15, 16 తేదీల్లో కేరళలోని కాలడి ఆదిశంకరాచార్య సంస్కృత విశ్వవిద్యాలయం పూర్వ కులపతి ఆచార్య మోనిపల్లి చంద్రశేఖరం నాయర్ దిలీప్‌కుమార్ బృందం గాయత్రి కాలేజీకు వచ్చి ప్రయోగశాలలు, పరీక్షల నిర్వహణ, భవన సముదాయాలు, జిమ్, సోలార్ సిస్టమ్, ఆటస్థలం, మెస్, కరిక్యులం, విద్యార్థుల ప్రగతి, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ వంటి అనేక అంశాలు పరిశీలించి ఏ ప్లస్ గ్రేడ్ ఇచ్చారని వివరించారు. నాక్ ఎ ప్లస్ గ్రేడ్ పొందిన తొలి కళాశాలగా జిల్లాలో గాయత్రి కాలేజీ ఆఫ్ సైన్సు అండ్ మేనేజ్‌మెంట్ కళాశాల నిలిచిందన్నారు. నాక్ సలహాదారునిగా పొన్నాడ వెంకట రమేష్ వ్యవహరించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు పులఖండం శ్రీనివాసరావు, విద్యా సంస్థల డైరెక్టరు అంబటి రంగారావు, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ మార్తాండ కృష్ణ, విద్యాసంస్థల ప్రిన్సిపాల్స్, వివిధ విభాగాధిపతులు వి.మహేష్, కె.వి.వి.సత్యనారాయణ, పి.సీతారామునాయుడు తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ సద్వినియోగం కావాలి



మాట్లాడుతున్న శ్రీకాకుళం డీఈఓ తిరుమలచైతన్య

పాలకొండ రూరల్: ప్రభుత్వం ఉపాధ్యాయులకు అందిస్తున్న శిక్షణ సద్వినియోగం చేసుకోవాలని శ్రీకాకుళం జిల్లా విద్యా శాఖాధికారి ఎస్.తిరుమలచైతన్య అన్నారు. స్థానిక తమ్మినాయుడు విద్యాసంస్థల్లో డీఎస్సీ-2018 ఉపాధ్యాయులకు శుక్రవారం వృత్యంతర శిక్షణ తరగతులు నిర్వహించారు. జాతీయ విద్యా విధానం, విద్యా హక్కు చట్టం, బహుళ తరగతుల బోధన, నిర్మాణాత్మక అభ్యసనం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. శిక్షణ కార్యక్రమంలో ఉప విద్యాశాఖాధికారిణి ఆర్.విజయ కుమారి, జి.వి.రమణ, రిసోర్స్ పర్సన్లు సీహెచ్ సంతోష్‌కుమార్, ఉషారాణితో పాటు పాలకొండ, సీతంపేట, భామిని, వీరఘట్టం, బూర్జ మండలాలకు చెందిన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.